



ఈసారైనా.. 'గూడు' కుదిరేనా?



- గత ప్రభుత్వంలో అందని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు
- ఇందిరమ్మ ఇళ్ల పథకంతో కాంగ్రెస్ సర్కారు చేయూత
- సొంత స్థలముంటే ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల సాయం
- విడతల వారీగా లబ్ధిదారుల ఖాతాలో జమచేయనున్న ప్రభుత్వం
- రేపు పథకాన్ని ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- తొలి విడతలో ఉమ్మడి జిల్లాకు రానున్న 50వేలకు పైగా ఇందిరమ్మ ఇళ్లు

పదేళ్లుగా పేదోడికి సాకారం కాని సొంతింటి కల

వరంగల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పేదోడి సొంతింటి కల కలగానే మిగిలింది. ఇల్లు లేని నిరుపేదలకు సొంతింటిని నిర్మించి ఇస్తామని చెప్పిన పాలకుల మాటలు నీటి మూటలే అయ్యాయి. గత ప్రభుత్వం అర్హులందరికీ విడతల వారిగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పినప్పటికీ ఆచరణలో అమలు నోచుకోలేదు. గత ఏడాది గృహలక్ష్మీ పేరుతో దరఖాస్తులు స్వీకరించినప్పటికీ ఎన్నికల కోడ్‌తో ఆ పథకం ముందుకు సాగలేదు. దీంతో పదేళ్లుగా సొంత ఇళ్లు కలగా మారింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం జాగా ఉంటే రూ.5లక్షల సాయంతో సొంతింటి నిర్మించి ఇచ్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించనుంది. దీంతో పేదోడికి సొంతింటిపై మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి.

డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు

2014లో బీఆర్ఎస్ పార్టీ సింగల్ బెడ్‌రూమ్‌తో పేదలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అర్హులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఇస్తామని ఎన్నికలకు ముందు ప్రకటించింది. 2016-17 ఆర్థిక సంవత్సరంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకాన్ని ప్రారంభించింది ప్రతీ నియోజకవర్గానికి 500 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించింది. 2016-19 వరకు మూడేళ్లలో మొత్తం ఉమ్మడి వరంగల్ జిల్లాకు 32వేల డబుల్ ఇళ్లు మంజూరయ్యాయి. అప్పటి మంత్రి చందులాల్, స్పీకర్ మధుసూదనాచారితో పాటు కొంత మంది అధికార పార్టీ ఎమ్మెల్యేలు అదనంగా డబుల్ ఇళ్లను మంజూరు చేయించుకున్నారు. అయితే డబుల్ ఇళ్ల నిర్మాణం నత్తనడకన సాగాయి. వరంగల్ అర్బన్ జిల్లాలో చేపట్టిన 4,784 ఇళ్లలో సగం కూడా పూర్తి కాలేదు. కొన్నిచోట్ల డబుల్ ఇళ్లు నిర్మాణం పూర్తి చేసిన లబ్ధిదారులకు పంపిణీ చేయకుండా తాత్సారం చేశారు. భూపాలపల్లి జిల్లాలో 3,882 ఇళ్లు మంజూరు అయితే 1,500 నిర్మాణాలు పూర్తి అయ్యాయి. భాస్కర్‌గడ్డలో ఉన్న 9,940 ఇళ్లు పంపిణీ చేసినప్పటికీ ఆ ఇళ్లలో కనీస వసతులు లేక నిరుపయోగంగా మారుతున్నా యి. మహబూబాబాద్ జిల్లాలో 5,571 ఇళ్లు మంజూరి కాగా, 1,733 ఇళ్లు మాత్రమే పూర్తి అయ్యాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డబుల్ ఇళ్లు ట్రబుల్‌గా మారటంతో సొంతింటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో గత ప్రభుత్వం 2020-21లో సొంత జాగా ఉంటే ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల ఆర్థిక సాయం చేస్తా మని ప్రకటించింది. అయితే ఆ పథకం అమలుకు నోచుకోలేదు. 2023-24లో గృహలక్ష్మీ పేరుతో సొంత జాగాలో ఇళ్లు నిర్మించుకుంటే రూ.3లక్షల ఆర్థిక సాయం చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు దరఖాస్తులు కూడా స్వీకరించింది.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 2,58,090 మంది దరఖాస్తులు రాగా, అధికారుల బృందం క్షేత్రస్థాయిలో పరిశీలిన చేసింది. ఇందులో 1,91,240 మంది అర్హులుగా గుర్తించింది. అయితే తొలి విడతలో నియోజకవర్గానికి 3వేల ఇళ్లే ప్రభుత్వం కేటా యించింది. ఉమ్మడి జల్లాలో మొత్తం 30వేల గృహ లక్ష్మీ ఇళ్లు మంజూర య్యాయి. ములుగు, హనుమ కొండ, మహబూబాబాద్, జనగామ జిల్లాలో కొన్నిచోట్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు కూడా అందించారు. అయితే ఎన్నికల కోడ్ రావటంతో గృహలక్ష్మికి బ్రేక్ పడింది. అటు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అందక, ఇటు గృహలక్ష్మి పథకం ద్వారా సొం తింటి కల ఆవిరి కావటంతో లబ్ధిదారులు తీవ్ర నిరాశలో ఉన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పదేళ్లలో 5వేల మందికి కూడా పూర్తిస్థాయిలో సొంత ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం చేయూతనివ్వలేదనే విమర్శలు ఉన్నాయి. పదేళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూపులే మిగిలాయి తప్ప.. కల సాకారం కాలేదని లబ్ధిదారులు వాపోతున్నారు.

వైఎస్ హయాంలో..

సొంతిల్లు పేదోళ్ల కల. ప్రభుత్వం అందించే ఆర్థిక సాయంతో సొంతింటిని నిర్మించుకోవాలని ఎంతోమంది పేదలు ఎదురుచూస్తున్నారు. 2014కు ముందు కాం గ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశపె ట్టింది. చాలా గ్రామాల్లో ఇందిరమ్మ కాలనీలను ఏర్పా టు చేసి, సొంతింటిని నిర్మించి ఇచ్చింది. జాగా ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి రూ.1లక్ష నుంచి రూ.1.50లక్షల వరకు ఆయా సామజికవర్గాలను బట్టి ఆర్థికసాయం అందించింది.

ఇందిరమ్మ ఇళ్ల పథకంతో..

పదేళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూసిన అర్హులైన పేదలకు కొత్త ప్రభుత్వం గూడుపై గుడ్‌న్యూస్ చెప్పింది. తొలి దశలో సొంతంగా జాగా ఉంటే ఇంటిని నిర్మించుకునేందుకు ఆర్థిక సాయం చేస్తా మని ప్రభుత్వం ప్రకటించింది. ఆ తరువాత సొం తంగా ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇందిరమ్మ కాలనీ లను ఏర్పాటు చేయనుంది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆరుగ్యారంటీలను ప్రకటించింది. అందులో ఇందిరమ్మ



మిగతా 7వ పేజీలో..

ఉమ్మడి జిల్లాకు 50వేలకు పైగా ఇళ్లు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో తొలి విడతలో 50వేలకు పైగా ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారులకు అందనున్నాయి. ప్రభుత్వం ప్రతీ నియోజకవర్గానికి తొలివిడతలో 3,500 ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నట్లుగా ప్రకటించింది. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 అసెంబ్లీ నియోజకవర్గాలకు 42వేల ఇందిరమ్మ ఇల్లు మంజూరు కానున్నాయి. అలాగే భూపాలపల్లి జిల్లాలో మంథని నియోజకవర్గంలోని సగానికి పైగా మండలాలు ఉన్నాయి. అలాగే ములుగు జిల్లాలో భద్రాచలం నియోజకవర్గంలోని రెండు మండలాలు, మహబూబాబాద్ జిల్లాలో ఇల్లందు నియోజకవర్గంలోని రెండు మండలాలు, హనుమకొండ జిల్లాలో హుస్నాబాద్ నియోజకవర్గంలోని రెండు మండలాలు, హుజురాబాద్ నియోజకవర్గంలో ఒక మండలం కలిసి ఉంది. ఈ మండలాల్లో కూడా సుమారు 8వేలకు పైగా ఇందిరమ్మ ఇళ్లు రానున్నాయి. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఒక్కొక్క ఇంటికి రూ.5లక్షల చొప్పున మొత్తం 50వేల ఇందిరమ్మ ఇళ్లకు రూ.25వేల కోట్లు ఖర్చు చేయనున్నారు.

మహిళా సదస్సుకు తరలేందుకు ఏర్పాట్లు చేయండి

- జిల్లా కలెక్టర్ భవేశ్‌మిశ్రా

కాకతీయఖని, మార్చి 9 : సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో ఈ నెల 12న నిర్వహించనున్న మహిళా సదస్సుకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి వెళ్లే మహిళలకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి లక్ష మంది స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశం అవుతారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఈ సదస్సుకు మునిసిపాలిటీతో పాటు అన్ని మండలాల్లోని మహిళలు వెళ్లేందుకు 11 బస్సులను ఏర్పాటు చేశామని చెప్పారు. జిల్లా నుంచి సుమారు 550 మంది మహిళలు సికింద్రాబాద్‌కు వెళ్లనున్నట్లు తెలిపారు. ఎంపీడీవోలు వారికి కావల్సిన సౌకర్యాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఒక్కో బస్సుకు ఇద్దరు లైజనింగ్ అధికారులను, పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సదస్సు ముగిసిన అనంతరం తిరిగి గమ్యస్థానాలకు క్షేమంగా చేరే వరకు రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు తగు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమ బాధ్యతలను డీఆర్‌డీవో నరేష్‌కు అప్పగించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

అన్ని రకాల వైద్యులను నియమించాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

సింగరేణి ఆస్పత్రిలో సి.టి స్కానింగ్ యంత్రం ప్రారంభం

కాకతీయఖని, మార్చి 9 : భూపాలపల్లి ఏరియా సింగరేణి ఆస్పత్రిలో అన్ని రకాల వైద్యులను నియమించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సింగరేణి యాజమాన్యం రూ.3.1 కోట్లు వెచ్చించి ఏర్పాటు చేసిన సి.టి స్కానింగ్ యంత్రాన్ని శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సింగరేణి యాజమాన్యం కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు, ప్రభావిత ప్రాంత ప్రజలకు ఉపయోగపడేలా సి.టి స్కానింగ్ యంత్రాన్ని ఏర్పాటు చేసిందన్నారు. గతంలో కార్మికులకు గుండెపోటు వస్తే సి.టి స్కానింగ్ కోసం హనుమకొండ, హైదరాబాద్, గోదావరిఖనికి తీసుకెళ్లాల్సి వచ్చేదన్నారు. అయితే ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ఆస్పత్రిలో వైద్యుల కొరత ఉన్నందున వెంటనే నియమించాలని సూచించారు. గత సీఎండీ శ్రీధర్ కేసీఆర్ కుటుంబానికి లాభం చేకూర్చి సింగరేణి సంస్థను దివాళా తీయించారని ఆరోపించారు. అందుకే తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎండీగా బలరాంనాయక్‌ను నియమించిందని చెప్పారు. ఆయన వెంటనే ఏరియా ఆస్పత్రిలో సి.టి స్కానింగ్ యంత్రం ఏర్పాటు చేయించారన్నారు. ఇంకా ఎంఆర్‌ఐ, సింగిల్ డోర్ యంత్రాలను అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

ఆస్పత్రిలో అవసరమైన వైద్య సిబ్బందిని కాంట్రాక్ట్ పద్ధతిలోనైనా నియమించాలని ఎమ్మెల్యే సత్యనారాయణరావు అన్నారు. ఏరియాలో ఎంతో మంది క్వాలిఫైడ్ వైద్యులు అందుబాటులో ఉన్నారని, వారు సింగరేణికి సేవలు అందించేలా మాట్లాడుతానని హామీ ఇచ్చారు. సింగరేణి సేఫ్ నిధులను ఈ ప్రాంత



సీ.టీ. స్కానింగ్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

అభివృద్ధికే ఖర్చు చేయాలని అధికారులకు సూచించారు. సింగరేణి ఆస్పత్రిని సూపర్ స్పెషాలిటీగా చేసేందుకు యాజమాన్యం కృషి చేయాలన్నారు. జిల్లా మెడికల్ కళాశాల అభివృద్ధికి సింగరేణి నిధులు వెంచించాలన్నారు. ఈ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి సింగరేణి యాజమాన్యం సహకరించాలని కోరారు. సంస్థ అభివృద్ధికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్(పా) ఎస్‌వీకే.శ్రీనివాస్, ఏరియా జీఎం శ్రీనివాసరావు, అదనపు చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ పద్మజ, అధికారులు వెంకట్రామిరెడ్డి, అజ్మీర తుకారాం, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నాయకులు రాజ్‌కుమార్, జనక్‌ప్రసాద్, రమేష్, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

చెరువులు మాయం..!



జిల్లా కేంద్రంలోని గోరంట్ల కుంట శిఖం భూమిలో వెలిసిన వెంచర్

జిల్లా కేంద్రంలో కబ్జాకు గురవుతున్న నీటి వనరులు

యథేచ్ఛగా ఆక్రమిస్తున్న కబ్జారాయుళ్లు

కాపాడుకునేందుకు కోర్టుకెక్కుతున్న నీటిపారుదల శాఖ

ఆక్రమణల తొలగింపుపై పట్టించుకోని కలెక్టర్

భూపాలపల్లి కలెక్టరేట్, మార్చి 9: జిల్లా కేంద్రంలోని నీటి వనరులు అన్యాక్రాంతం అవుతున్నాయి. కాపాడాల్సిన ప్రజాప్రతినిధులే చెరువులను చెర పడుతున్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని చెరువులు ఒక్కొక్కటిగా మాయం అయ్యే పరిస్థితి నెలకొంది. కౌన్సిలర్లే యథేచ్ఛగా కబ్జా చేసి వెంచర్లు వేసేస్తున్నారు. మరోవైపు సామాన్యుల పేరిట ప్రభుత్వ ఉద్యోగులు, సింగరేణి కార్మికుల కుటుంబాలు చెరువుల్లో గుడిసెలు వేసుకుంటున్నారు. చెరువుల్లో వెలిసిన అక్రమ కట్టడాలను తొలగించేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాల్సిన కలెక్టర్ మౌనముద్ర వహిస్తున్నారు. నీటి వనరులను కాపాడేందుకు మరో దిక్కులేక నీటిపారుదల శాఖ అధికారులు కోర్టు మెట్లెక్కేందుకు సిద్ధం అవుతున్నారు.

మాయం చేసేస్తున్నారు..

జిల్లా కేంద్రంలోని చెరువులు, పంట కాలువలు మాయం అవుతున్నాయి. కలెక్టరేట్‌కు కూత వేటు దూరంలోని గోరంట్లకుంట శిఖం భూములు పూర్తిగా అన్యాక్రాంతం అయ్యాయి. సర్వే నెంబర్ 209లోని 22.19 ఎకరాల శిఖం భూమిని కబ్జా చేసి వెంచర్లు, సాగు భూములు చేయడంతో పాటు మాజీ ఎమ్మెల్యే ఏకంగా గుడి నిర్మాణం చేసి కాంప్లెక్స్ కూడా కట్టారు. భూపాలపల్లి మునిసిపాలిటీకి చెందిన ఓ కౌన్సిలర్ శిఖం భూమిలో వెంచర్ వేసి ప్లాట్స్ చేసి అమ్మడం కూడా జరిగిపోయింది. 255, 256 సర్వే నెంబర్లలో ఉన్న బొబ్బగట్టు మాటు పంట కాలువను పక్కకు జరిపి వెంచర్ వేసిన వైనం భూపాలపల్లిలోని భాస్కర్‌గడ్డలో చోటుచేసుకుంది.

శిఖం భూమిలో వెంచర్

భూపాలపల్లిలోని గోరంట్ల కుంట ఉన్న సర్వే నెంబర్ 209లో కౌన్సిలర్ యథేచ్ఛగా కబ్జా చేసి సర్వే నెంబర్ 213, 214 పేరిట ప్లాట్‌లను అమ్మేసుకున్న వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎన్నికలకు ముందు అప్పటి అధికార పార్టీ బీఆర్ఎస్‌లో చక్రం తిప్పిన సదరు కౌన్సిలర్ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పంచన చేరి తన వెంచర్ కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారనే విమర్శలున్నారు. సదరు కబ్జారాయుడు అయిన కౌన్సిలర్‌కు గతంలో పనిచేసిన తహసీల్దార్ కావాల్సినంత సాయం చేసి రుణం పొందినట్లు ఆరోపణలున్నాయి. ఈ వెంచర్‌లో విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సౌకర్యం కల్పించడం కోసమెరుపు. కబ్జాల్లో ఆరితేరిన మరికొంత మంది కౌన్సిలర్లు తమ ఆక్రమణలను కాపాడుకునేందుకు అధికార పార్టీలో చేరారనే వాదనాలున్నాయి.

సామాన్యుల పేరిట..

భూపాలపల్లి పట్టణంలోని పాత ఎర్రచెరువులో వెలిసిన గుడిసెల్లో అక్రమార్కులే ఎక్కువగా ఉన్నారనే ఆరోపణలున్నాయి. కమ్యూనిస్టుల ప్రోద్బలంతో చెరువులోనే పెద్ద మొత్తంలో గుడిసెలు వేశారు. సామాన్యుల చాటున ప్రభుత్వ ఉద్యోగులు, సింగరేణి కార్మికుల కుటుంబాలు, సొంతంగా ఇండ్లు ఉన్నవారితో పాటు స్థానికేతరులు కూడా గుడిసెలు వేసిన వారిలో ఉన్నట్లు సమాచారం. భూపాలపల్లి మండలం మోరంచపల్లి సబ్‌సెంటర్‌లో పనిచేసే ఓ ఆశ కార్యకర్త కూడా గుడిసె వేసినట్లు సమాచారం. వీరితో

మిగతా 8వ పేజీలో...



శిఖం భూమిని కబ్జాచేసి మిరప తోట సాగు చేస్తున్న దృశ్యం



భాస్కర్‌గడ్డ సమీపంలోని బొబ్బగట్టు మాటు కాలువలో ఏర్పాటు చేసిన వెంచర్‌ను పరిశీలిస్తున్న నీటిపారుదల శాఖ అధికారులు (ఫైల్)

ముగిసిన మహాశివరాత్రి జాతర

వైభవంగా ఆదిముక్తీశ్వర స్వామి కల్యాణం



కాళేశ్వరంలో ఆదిముక్తీశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మహదేవపూర్, మార్చి 9 : మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం కాళేశ్వరంలో మూడు రోజులుగా వైభవంగా జరిగిన మహాశివరాత్రి ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ నెల 7, 8, 9 తేదీల్లో జాతర జరుగగా, పలు పూజా కార్యక్రమాలు ప్రశాంతంగా ముగిశాయి. ప్రసాదాల అమ్మకం, అభిషేకాలతో పాటు ఇతర పూజలు, ప్రత్యేక దర్శనం టికెట్ల అమ్మకం ద్వారా రూ.13 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. గతేడాది కంటే ఈసారి రూ.4 లక్షల ఆదాయం తక్కువగా వచ్చింది. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజైన శనివారం ఆదిముక్తీశ్వర స్వామి వారి కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. మంగళవాయిద్యాల నడుమ అర్చకులు, వేద పండితులు ఆదిముక్తీశ్వర స్వామి ఆలయం వద్ద కల్యాణాన్ని జరిపించారు. కార్యక్రమంలో ఈవో మారుతి, ఎంపీటీసీ మమత, ధర్మకర్తలు సమ్మయ్య, రాంరెడ్డి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరా.. చల్లంగ చూడు..

రామప్పలో రెండో రోజు భక్తుల రద్దీ



రామలింగేశ్వర స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

వెంకటాపూర్(రామప్ప), మార్చి 9 : హరహర మహదేవ శంభోశంకర అంటూ.. భక్తులు ఆది దేవుడిని స్మరించుకుంటున్నారు. రామప్ప రామలింగేశ్వర స్వామి చల్లంగా చూడంటూ వేడుకుంటున్నారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం రామప్పలో భక్తుల మొక్కులు కొనసాగాయి. ఆలయ కార్యనిర్వహణ అధికారి బిల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నారు. శనివారం ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, గణపతి పూజ, శ్రీస్వామి వారి రుద్రాభిషేకం, 11 గంటల నుంచి గణపతి పూజ, గ్రహారాధన, వీరభద్ర పల్లేరము, సాయంత్రం భద్రకాళి పూజ, సహస్రనామార్చన, బలిహరణము, రాత్రి దీపోత్సవం వంటి కార్యక్రమాలను ప్రధాన అర్చకులు హరీష్‌శర్మ, ఉమాశంకర్ నిర్వహించారు. స్థానిక ఎస్సై చల్ల రాజు సిబ్బందితో రామప్పలో బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున 4గంటలకు జరిగే అగ్నిగుండాల కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేశారు. పూజారులు కావాల్సిన పూజా సామగ్రి సిద్ధం చేసుకున్నారు. అగ్నిగుండాల కార్యక్రమానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని ఆలయవర్గాలు చెబుతున్నాయి. అగ్నిగుండాల కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ అధికారులు తెలిపారు.

వినియోగదారులు ఈకేవైసీ చేయించుకోవాలి

జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

కాకతీయఖని, మార్చి 9 : తెల్ల రేషన్‌కార్డు కలిగి ఉన్న గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. భూపాలపల్లి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శనివారం పౌర సరఫరాల అధికారులు, గ్యాస్ డీలర్లతో ఈకేవైసీ ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ.500లకే గ్యాస్ ఇవ్వాలని నిర్ణయించిన నేపథ్యంలో జిల్లాలోని లబ్ధిదారులు తెల్ల రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, గ్యాస్ కనెక్షన్, బ్యాంకు అకౌంట్ నంబర్, సెల్‌ఫోన్ నంబర్‌తో గ్యాస్ ఏజెన్సీల వద్ద ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఒకవేళ ఈకేవైసీ చేయించుకోకుంటే మహాలక్ష్మి పథకానికి లబ్ధి పొందలేరన్నారు. ప్రజలకు అవగాహన కోసం ఎంపీడీవో, మునిసిపల్ కార్యాలయాల వద్ద బ్యానర్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో పౌర సరఫరాల సంస్థ డీఎం రాఘవేంద్రరావు, గ్యాస్ ఏజెన్సీల డీలర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మహబూబాబాద్ రూరల్, మార్చి 9: రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ మండలం అయోధ్య గ్రామ శివారులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కేసముద్రం మండలం తాళ్లపూసపల్లి గ్రామ శివారు ముత్యాలమ్మ తండాకు చెందిన కేలోతు కిషన్ (38) నాటు కోళ్ల విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తాళ్లపూసపల్లి నుంచి మహబూబాబాద్‌కు సొంత పనినిమిత్తం తన ద్విచక్ర వాహనంపై వస్తున్న క్రమంలో అయోధ్య గ్రామ శివారులో రోడ్డు పక్కన ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీ కొట్టాడు. ఈ ఘటనలో కిషన్ తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

అవకాశం కల్పించండి

హనుమకొండ చౌరస్తా, మార్చి 9: బీఆర్ఎస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు సిరిమల్లె సదానందం స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని శనివారం కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సదానందం మాట్లాడుతూ.. 22 ఏళ్లుగా బీఆర్ఎస్ పార్టీలో చురుకైన కార్యకర్తగా, ఉద్యమకారుడిగా సేవలు చేశానన్నారు.

ఉద్యమకారులకే బీఆర్ఎస్ ఎంపీ టికెట్ ఇవ్వాలి..

- అరూరి రమేశ్, కడియం కావ్యకు ఇవ్వొద్దు
- ఉద్యమకారుల డిమాండ్.. పసునూరి ఆధ్వర్యంలో రహస్య భేటీ


భేటీలో పసునూరితో ఉద్యమకారులు

వరంగల్ క్రైం, మార్చి 9: రెండు సార్లు ఎమ్మెల్యేగా చేసి ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఓటమిపాలైన అరూరి రమేశ్‌కు, పార్టీ ప్రాథమిక సభ్యత్వం కూడా లేని కడియం కావ్యకు వరంగల్ ఎంపీ టికెట్ ఇవ్వొద్దని బీఆర్ఎస్ అధిష్ఠానాన్ని ఉద్యమకారులు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించి పార్టీ కోసం పనిచేస్తున్న తమలో ఒకరికి అవకాశం కల్పించాలని వారు స్పష్టం చేస్తున్నట్లు తెలిసింది. శనివారం రాత్రి హనుమకొండ హంటర్‌రోడ్డులోని ఒక కన్వెన్షన్‌లో వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ ఆధ్వర్యంలో ఉద్యమకారులు జోరిక రమేశ్, వీరేందర్, బోడ డిన్నా, చింతల యాదగిరి, బండి రజనీకుమార్, ఎం.శ్రీనివాస్, సదానందం రహస్య భేటీ నిర్వహించారు.

వరంగల్ ఎంపీ టికెట్ ఇచ్చే విషయంలో పార్టీ అధిష్ఠానం ప్రస్తుతం ఎంపీగా కొనసాగుతున్న తనను పరిగణలోకి తీసుకోకపోవడంపట్ల పసునూరి దయాకర్ అసహనంతో ఉన్నట్లు తెలిసింది. ఈ క్రమంలోనే ఉద్యమకారులతో పసునూరి దయాకర్ భేటీ నిర్వహించినట్లు సమాచారం. ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్‌లో ఉన్నవారిలో ఉద్యమ సమయం నుంచి కొనసాగిన ఏకైక వ్యక్తినని ఆయన పేర్కొన్నట్లు సమాచారం. తనను పార్టీ ఏమాత్రం పరిగణలోకి తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. నిన్నమొన్న వచ్చిన వారికి పార్టీ పెద్దపీట వేస్తోందని పేర్కొనట్లు సమాచారం. భేటీ అయిన వారిలో ఎవరికి ఇచ్చినా తాను సహకరిస్తానని, వారి గెలుపునకు తనవంతు సహకారం అందిస్తానని పసునూరి తెలిపినట్లు తెలిసింది. ఒక వేళ తనకు అవకాశం వచ్చినట్లైతే ఉద్యమకారులకు పార్టీలో సముచిత స్థానం దక్కేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు తెలిసింది.

రహస్య భేటీకి హాజరైన ఉద్యమకారులు తమలో ఎవరికి అవకాశం కల్పించినా ఐక్యంగా ఉండి గెలిపించుకుంటామని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. తమ నిర్ణయాన్ని పార్టీ పరిగణలోకి తీసుకోనట్లైతే ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కుందామని, ఉద్యమకారులకు గౌరవం ఇచ్చే సంస్థలోకి వెళదామని పలువురు ఉద్యమకారులు వారి అభిప్రాయాలను కుండబద్దలు కొట్టినట్లు తెలిపినట్లు సమాచారం. కాగా, ఒకరిద్దరు ఉద్యమకారులు మాట్లాడుతూ.. రెండుసార్లు ఎంపీగా చేసిన పసునూరి దయాకర్‌ను సైతం టికెట్ రేసు నుంచి తప్పుకోవాలని కోరినట్లు తెలిసింది. ఈ భేటీ బీఆర్ఎస్‌లో ప్రకంపనలు సృష్టించే అవకాశం ఉంది.

నేడు ఉచిత శిక్షణకు ప్రవేశ పరీక్ష

వడ్డెపల్లి, మార్చి 9: షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ ద్వారా 5 నెలల పాటు వివిధ ఉద్యోగాల కోసం నిర్వహించే పోటీ పరీక్షలకు హనుమకొండ వడ్డెపల్లి లోని షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు సంస్థ అధికారి బి.నిర్మల, స్టడీ సర్కిల్ ఉమ్మడి వరంగల్ జిల్లా శాఖ గౌరవ సంచాలకుడు డాక్టర్ కొంగర జగన్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. హాల్ టికెట్‌పై ఫొటో సరిగా ముద్రితం కాకుంటే ఫొటో అతికించి గెజిటెడ్ అధికారితో సంతకం చేయించాలని పేర్కొన్నారు. అభ్యర్థులు పరీక్ష సమయంలో బ్లాక్‌పెన్ మాత్రమే వాడాలని, పరీక్ష కేంద్రానికి హాల్ టికెట్, ఆధార్‌కార్డు తీసుకొని గంట ముందుగానే హాజరు కావాలని తెలిపారు. వివరాలకు సెల్ నంబర్ : 95428 34507 లో సంప్రదించాలని కోరారు.

ఉచిత ఫిట్‌నెస్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 9: ఆర్మీ కానిస్టేబుల్ ఉద్యోగాలకు సంబంధించిన ఉచిత ఫిట్‌నెస్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా కేవీఆర్ ఫిట్‌నెస్ సెంటర్ ట్రైనర్ కీసరి రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు 9133224565 ఫోన్ నెంబర్‌లో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. శిక్షణ తరగతులు ఈ నెల 13 నుంచి వరంగల్ ఓసిటీ గ్రౌండ్‌లో ప్రారంభం అవుతాయని తెలిపారు.

13న జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 9: ములుగురోడ్‌లోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ నెల 13న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం.మల్లయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా యాక్సిస్ బ్యాంకులో ఖాళీగా ఉన్న బిజినెస్ డెవలప్‌మెంట్ ఎక్జిక్యూటివ్స్‌గా ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. 18 నుంచి 28 యేళ్ల వయస్సు కలిగి ఏదేని డిగ్రీ పూర్తి చేసిన యువతీ, యువకులు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉండి అర్హులైన వారు ఈ నెల 13న నిర్వహించే జాబ్ మేళాకు ఉదయం 11గంటలలోపు ధ్రువీకరణ జిరాక్స్ పత్రాలతో హాజరు కావాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు 9848895937 ఫోన్ నెంబర్లు సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

17న జిల్లా స్థాయి చెస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, మార్చి 9: తెలంగాణ రాష్ట్ర చెస్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ జిల్లా చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 17న హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వహణ కార్యదర్శి కన్నా ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-15 బాలబాలికల విభాగంలో వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. 2009 జనవరి 1లోపు జన్మించిన వారు ఇందులో పాల్గొనవచ్చని కన్నా తెలిపారు. ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విజేతలకు బహుమతులను, ప్రశంసాపత్రాలను అందించనున్నట్లు ఆయన వెల్లడించారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9059522986లో సంప్రదించాలని తెలిపారు.

పేకాట కేంద్రంపై దాడి

వరంగల్ క్రైం, మార్చి 9: మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కరీమాబాద్‌లో ఒకరి నివాసంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్, ఎస్‌ఐ శరత్ ఆధ్వర్యంలో దాడి చేశారు. శనివారం నిర్వహించిన దాడిలో రూ.24వేల నగదు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురిపై కేసు నమోదు చేశారు.

కారు బేజారు

- రోజురోజుకూ బీఆర్‌ఎస్‌ను వీడుతున్న నాయకులు
- అడ్డుకట్ట వేయడంలో నాయకత్వం విఫలం



వరంగల్ క్రైం, మార్చి 9: బీఆర్‌ఎస్‌లో నాయకత్వ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. క్యాడర్ పార్టీనీ వీడుతున్నా అడ్డుకునే నాయకత్వం కరువైంది. బీఆర్‌ఎస్‌కు సంస్థాగతంగా నిర్మాణం లేకపోవడం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. శాసనసభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమి చవిచూశాక పార్టీ కేడర్ అధికార పార్టీ కాంగ్రెస్ వైపు వెళుతోంది. శాసనసభ ఎన్నికల అనంతరం ఒక్కొక్కరిగా పార్టీని వీడుతున్నారు. పదేళ్ల అధికారాన్ని అనుభవించిన పార్టీ నేతలు సైతం ఓటమిని తట్టుకోలేక పదవుల కోసం కాంగ్రెస్ కండువా కప్పుకుంటున్నారు. బడానేతలు భవిష్యత్ కోసం బీఆర్‌ఎస్‌ను వీడుతుండగా, వారి వెంట కేడర్ అంతా వలస బాట పడుతున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ మనుగడ ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. పదేళ్ల అధికారాన్ని అనుభవించిన బీఆర్‌ఎస్ నేతలు.. అధికారం లేకుండా ఉండలేకపోతున్నారు. అధికారం కోల్పోయిన నెలరోజుల్లోనే బీఆర్‌ఎస్‌ను వీడుతున్నారు. కాంగ్రెస్ కండువా కప్పుకుంటున్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లా 12 అసెంబ్లీ నియోజకవర్గాలు, రెండు ఎంపీ నియోజకవర్గాలున్నాయి. 2018లో జరిగిన ఎన్నికల్లో 12 అసెంబ్లీ స్థానాల్లో ములుగులో కాంగ్రెస్ విజయం సాధించగా, మిగతా 11 నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు విజయం సాధించారు. ఆరు జిల్లాల జడ్పీలు, మండల పరిషత్‌లు సైతం బీఆర్‌ఎస్ కైవసం చేసుకుంది. రెండు ఎంపీ స్థానాలు సైతం బీఆర్‌ఎస్ అభ్యర్థులే గెలిచారు. కాగా, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 12లో కేవలం రెండు (స్టేషన్ ఘనపూర్, జనగామ) మినహా 10 స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. అధికారంలో లేని బీఆర్‌ఎస్‌లో ఆపార్టీ క్యాడర్ ఉండలేకపోతున్నారు. పదవులు పదిలం చేసుకునేందుకు, భవిష్యత్‌లో పదవులు పొందేందుకు కాంగ్రెస్ బాటపడుతున్నారు. మూడు మాసాల్లోనే నర్సంపేట, పరకాల, వర్ధన్నపేట మున్సిపాలిటీలు కాంగ్రెస్ ఖాతాలోకి వెళ్లాయి. వరంగల్ కార్పొరేషన్ మేయర్‌తో పాటు వరంగల్ తూర్పులోని 15మంది కార్పొరేటర్లు, పశ్చిమ నియోజకవర్గం నుంచి ఆరుగురు కార్పొరేటర్లు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఎన్నికలకు ముందు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్ పార్టీని వీడారు.

తాజాగా శనివారం డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు ఆయన సతీమణి ఐనవోలు ఎంపీపీ మధుమతి, డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డితో పాటు ఐనవోలు, వర్ధన్నపేట మండలాల నుంచి పెద్దఎత్తున బీఆర్‌ఎస్ శ్రేణులు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. రేపో మాపో వర్ధన్నపేట నియోజకవర్గం పరిధిలోని 10మంది కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. వీరు స్థానిక ఎమ్మెల్యే నాగరాజుతో మాటాముచ్చట మాట్లాడుకున్నారు. శాసనసభ ఎన్నికల ముందే భూపాలపల్లి మున్సిపాలిటీకి చెందిన పలువురు కౌన్సిలర్లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న విషయం తెలిసిందే. మొత్తంగా బీఆర్‌ఎస్ క్యాడర్ అంతా కాంగ్రెస్ బాటపడుతుండటం విశేషం.

అడ్డుకునే నాయత్వం లేదు

కేడర్ ఖాళీ అవుతున్నా పట్టించుకునే నాయకత్వం కరువైంది. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్‌కు సంస్థాగతంగా పటిష్టమైన నిర్మాణం లేకపోవడం పార్టీకి నష్టం చేకూర్చుతోంది. జిల్లా పార్టీ అధ్యక్ష పదవులు ఎమ్మెల్యేలకు కట్టబెడుతూ నిర్ణయం తీసుకున్న అధిష్ఠానం కిందిస్థాయిలో పార్టీ కమిటీలను ఏర్పాటు చేయలేదు. ఉద్యమ సమయంలో నియమించబడిన కమిటీలే ప్రస్తుతం చెలామణి అవుతున్నాయి. వీరికి సరైన గుర్తింపు లేకపోవడంతో కేడర్‌ను పట్టించుకున్న పాపానపోవడం లేదు. మూడు మాసాలుగా పెద్దఎత్తున బీఆర్‌ఎస్ కేడర్ కాంగ్రెస్‌లోకి జంప్ చేస్తుంటే కనీసం వద్దు అనే నేత కరువయ్యాడు. జిల్లా పార్టీ అధ్యక్షులు సైతం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. పార్టీ మారే వారితో చర్చించి బరోసా ఇచ్చే ప్రయత్నం చేసిన దాఖలాలు లేవు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. ఎమ్మెల్యేలుగా ఓటమి చెందిన అధ్యక్షులు పక్క చూపులు చూసే పరిస్థితి బీఆర్‌ఎస్‌లో నెలకొంది. వీరు కేడర్‌ను పట్టించుకునే స్థితి లేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉన్నట్లు కనిపిస్తోంది. మొత్తంగా బీఆర్‌ఎస్ భవిష్యత్ ప్రశ్నార్థకంగా కనిపిస్తోంది.

ఈ సారైనా 'గూడు' కుదిరేనా?

(5వ పేజీ తరువాయి)

ఇళ్లు కూడా ఒకటి. ఈ నెల 11వ తేదిన సీఎం రేవంత్‌రెడ్డి భద్రాచలంలో ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. సొంత స్థలంలో కనీసం 400 చదరపు అడుగుల్లో ఇళ్లు నిర్మించుకోవాల్సి ఉంటుంది. ఈ ఇంటికి ప్రభుత్వం రూ.5లక్షల ఆర్థిక సాయం చేయనున్నట్లు ప్రకటించింది. నాలుగు విడతల్లో ఈ ఆర్థిక సాయం లబ్ధిదారులకు అందనుంది. మొదటి బేస్‌మెంట్ స్థాయిలో రూ.1లక్ష ఆర్థిక సాయం ప్రభుత్వం నుంచి రానుంది. అలాగే పైకప్పుకు మరో లక్ష రుపాయలు, ఆ తరువాత గోడల నిర్మాణం పూర్తి అయినా తరువాత మరో రూ.2లక్షలు సాయం అందించనున్నారు. ఇంటి నిర్మాణం మొత్తం పూర్తి అయినా తరువాత మిగతా రూ.1లక్ష కూడా లబ్ధిదారుడి బ్యాంకు ఖాతాలో జమ చేయనున్నారు. ఎలాంటి ఇల్లు లేని, తెల్లరేషన్‌కార్డు ఉన్న నిరుపేదలే ఈ పథకానికి అర్హులుగా ప్రభుత్వం ప్రకటించింది. గుడిసెలు, మట్టి గోడల ఇల్లున్న వారు కూడా ఇందిరమ్మ పథకానికి అర్హులుగా ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికే ప్రజాపాలన ద్వారా దరఖాస్తు చేసుకున్నవారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ప్రకటించింది. అయితే సొంత జాగా లేని అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం ఇందిరమ్మ పథకంలో భాగంగా జాగతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల సాయం చేస్తామని ప్రకటించింది. సోమవారం ప్రారంభమయ్యే ఇందిరమ్మ ఇళ్ల పథకంతో తమ సొంతింటి కల సాకారమవుతుందనే ఆశతో అర్హులైన పేదలు ఉన్నారు.

సీపీఐలోకి వేల్పుల సారంగపాణి



సీపీఐలో చేరినవారితో సాంబశివరావు

హనుమకొండ కలెక్టరేట్, మార్చి9: హనుమకొండకు చెందిన కార్మిక సంఘం నాయకుడు వేల్పుల సారంగపాణితోపాటు పలువురు నాయకులు శనివారం హైదరాబాద్‌లోని ముగ్దుం భవన్‌లో సీపీఐ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. హనుమకొండలో కార్మిక సంఘం నాయకుడిగా పనిచేస్తున్న సారంగపాణి పార్టీలో చేరడం హర్షనీయమన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి ఆధ్వర్యంలో సారంగపాణితో పాటు కోమటి రమేష్, గండు సత్యంలు సీపీఐలో చేరారు.

సీపీఎం నుంచి సారంగపాణి బహిష్కరణ

వరంగల్ కార్పొరేషన్: సీపీఎం పార్టీ నిబంధనలకు విరుద్ధంగా పని చేస్తున్న సీపీఎం జిల్లా నాయకుడు వేల్పుల సారంగపాణిని పార్టీ నుంచి బహిష్కరిస్తూ సీపీఎం జిల్లా అధ్యక్షుడు బొట్ల చక్రపాణి శనివారం ఆదేశాలు జారీ చేశారు. హనుమకొండ రాంనగర్‌లోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసిన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ.. పార్టీ నిర్మాణ పనులకు వ్యతిరేకంగా పని చేసిన వేల్పుల సారంగపాణిని బహిష్కరిస్తున్నట్లు చెప్పారు. ఇక నుంచి సీపీఎం పార్టీకి సారంగపాణికి ఎటువంటి సంబంధం లేదని పార్టీ సభ్యులు, నాయకులు గమనించాలని చక్రపాణి సూచించారు.

యువతి ఆత్మహత్య



కాజీపేట, ఫిబ్రవరి 9: పీహెచ్‌డీ ఎక్కడ చేయాలో తేల్చుకోక, తీవ్ర మనస్థాపానికి గురై ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట సిద్ధార్థనగర్‌కు చెందిన బల్గూరి వేణుగోపాల్ - వకుల దంపతులకు ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. కూతురు బల్గూరి వ్రింద (28)కు ఇండియాలో, అమెరికాలో పీహెచ్‌డీ సీటు వచ్చింది. పీహెచ్‌డీ ఎక్కడ చేయాలో తేల్చుకోక తీవ్ర మనస్థాపానికి గురై గదిలోకి వెళ్లి శుక్రవారం రాత్రి ఫ్యానుకు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు ఘటనా స్థలికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించామన్నారు. తండ్రి వేణుగోపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్ రెడ్డి తెలిపారు.

ఉద్యోగులపై హరీష్‌రావు వ్యాఖ్యలు సరికావు

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 9: ఉద్యోగులపై మాజీ మంత్రి హరీష్ రావు చేసిన వ్యాఖ్యలు సరికావని జీటీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాళ్లపెల్లి ప్రకాశ్ శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సకల జనుల సమ్మె ఉద్యోగుల కారణంగానే విజయవంతమైన సంగతి గుర్తు చేశారు. అలాంటి విషయాలను మరిచి మాజీ మంత్రి హరీష్‌రావు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. రైతులను గౌరవించాల్సిందే కానీ.. ప్రభుత్వంలో ఉద్యోగుల పాత్రను మరవద్దని హితవు పలికారు. వేతన బిల్లులు, పీఆర్సీ బకాయిలు, మెడికల్ బిల్లులు, జీపీఎ రుణాలు ఏండ్ల తరబడి పెండింగ్‌లో ఉంచిన వారి ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు అప్పటి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చూసి సహకరించిన సంగతిని గుర్తు చేశారు. హరీష్‌రావు తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు.

బంగారం ఎరచూపి డబ్బులతో ఉడాయింపు

ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన ● పోలీసులను ఆశ్రయించిన బాధితులు

బయ్యారం, మార్చి 9 : తాను ఆదాయపు పన్ను కార్యాలయంలో పనిచేస్తానని, తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తానని చెప్పి ఓ వ్యక్తి పలువురిని మోసం చేసి డబ్బులతో ఉడాయించాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం చోక్లాతండాలో ఆలస్యంగా వెలుగుచూసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. చోక్లాతండాకు చెందిన సాయి అనే వ్యక్తి కొంత కాలంగా ఇతర ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్నాడు. సుమారు ఏడాది కిందట చోక్లాతండాకు వచ్చిన సాయి.. క్రమేపీ సమీప బంధువులు, సుపరిచితులను మచ్చిక చేసుకుంటూ వారికి దగ్గరయ్యే ప్రయత్నం చేశాడు.

ఈ క్రమంలోనే తాను ఆదాయపు పన్ను కార్యాలయంలో పనిచేస్తానని.. తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తానంటూ నమ్మబలుకుతూ పలువురి దగ్గర నుంచి అందినకాడికి దండుకున్నాడు. కొందరు అప్పులు చేసి డబ్బులు ముట్టజెప్పగా.. మరికొందరు ఆశకొద్ది పాత బంగారం తాకట్టు పెట్టి డబ్బులు ఇచ్చినట్లు తెలిసింది. చోక్లాతండాతో పాటు సమీప గ్రామాలతో కలుపుకొని దాదాపు 10మంది వ్యక్తుల నుంచి సుమారు రూ.40 లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం. రెండు నెలలుగా చోక్లాతండాకు సాయి రాకపోవటం, ఎక్కడ ఉన్నాడనే సమాచారం కూడా స్పష్టంగా తెలియకపోవటంతో అనుమానం వచ్చిన బాధితులు.. శనివారం స్థానిక పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది. ఈ విషయమై బయ్యారం ఎస్సై ఉపేందర్‌ను వివరణ కోరగా.. సాయి అనే వ్యక్తి తమను మోసం చేసి డబ్బులతో ఉడాయించినట్లు పలువురు బాధితులు పేర్కొన్నారన్నారు. దీనిపై పూర్తి వివరాలు సేకరిస్తున్నామని త్వరలోనే అన్ని విషయాలు వెల్లడిస్తామన్నారు.



నేడు మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

ములుగు కలెక్టరేట్, మార్చి 9: ములుగులోని సాధన స్కూల్ సమీపంలోని మైదానంలో ఈ నెల 10వ తేదీన సర్వర్ చారిటబుల్ ట్రస్టు, ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళల సాధికారత, చట్టాలపై అవగాహన, స్వయం సహాయక రంగాల్లో రాణించడం, తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళా దినోత్సవ వేడుకలకు జిల్లాలోని మహిళలు పెద్దసంఖ్యలో తరలిరావాలని ఆమె కోరారు.

న్యాయం చేయాలని డీఎంహెచ్‌వోకు వినతి


డీఎంహెచ్‌వో అప్పయ్యకు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

ములుగు కలెక్టరేట్, మార్చి 9: వైద్య, ఆరోగ్య శాఖలో చేపట్టిన ప్రస్తుత నియామకాల్లో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న నర్సింగ్ ఉద్యోగులకు మొదటి ప్రాధాన్యత కల్పించి న్యాయం చేయాలని కోరుతూ తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ యూనియన్ నాయకులు గాదె రమేష్, ఎమ్డీ.ఫజల్ శనివారం డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ జగదీశ్‌లకు వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో ప్రాణాలకు తెగించి విధులు నిర్వర్తించడం జరిగిందన్నారు. వారికి రెగ్యులర్ పోస్టుల్లో ప్రభుత్వం వెయిటేజ్ కల్పించిందని, ప్రస్తుతం చేపట్టబోయే ఎన్‌హెచ్‌ఎం నియామకాలతో భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సర్ధార్, వేణు, తిరుపతి, వంగ రాజయ్య, కుమార్, రమేష్, రవి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలుంటే సంప్రదించండి : డీఎంహెచ్‌వో

కాకతీయఖని, మార్చి 9: నేషనల్ హెల్త్ మిషన్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ప్రొవిజనల్ లిస్టును జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని నోటీసు బోర్డులో అంటించి జిల్లా వెబ్‌సైట్‌లో ఉంచినట్లు జిల్లా వైద్యాధికారి మధుసూదన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో వివిధ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ వివరాలను సరిచూసుకుని ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 10న ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సంబంధిత పత్రాలతో హాజరు కావాలన్నారు.

అమిత్‌షా సభను విజయవంతం చేయాలి : బీజేపీ


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిషిధర్‌రెడ్డి

చిట్యాల, మార్చి 9 : హైదరాబాద్‌లో ఈ నెల 12న నిర్వహించ తలపెట్టిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా బహిరంగ సభను నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతల నిషిధర్‌రెడ్డి కోరారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల సన్నాహకంగా నిర్వహించే సభకు బూత్ స్థాయి కార్యకర్తలతో పాటు అనుబంధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. పార్టీ కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతీ గడపకు వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర వెంకటేష్, పార్లమెంట్ కోకన్వీనర్ లింగంపల్లి ప్రసాదరావు, మండల ప్రధాన కార్యదర్శి మాచర్ల రఘు, గజనాల రవీందర్, మైదం శ్రీకాంత్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు రాయిని శ్రీనివాస్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కాటారంలో మెగా జాబ్‌మేళా

కాటారం, మార్చి 9: రాష్ట్ర యువజన సర్వీసుల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో కాటారం బీఎల్ఎం గార్డెన్స్‌లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. ఈ మేరకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు క్యాంపు కార్యాలయం శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ జాబ్ మేళాలో 65 కంపెనీలకు పైగా పాల్గొని 5వేల మందిని ఎంపిక చేసుకోనున్నాయని తెలిపారు. 0-పీజీ(చదువుకోని వారితో పాటు పీజీ వరకు చదివిన వారు) ఉండి 18నుంచి 35ఏళ్ల గల యువతీ యువకులు జాబ్ మేళాకు హాజరు కావచ్చన్నారు.

యాజమాన్యాన్ని ఒప్పించి వేతనాలు ఇప్పించాలి

▸▸ మంత్రి సీతక్కకు బిల్ట్ కార్మిక కుటుంబాల వినతి


మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న బిల్ట్ కార్మికులు, కుటుంబ సభ్యులు

మంగపేట, మార్చి 9: మండలంలోని కమలాపురం బిల్ట్ కర్మాగారంలో పనిచేసి రోడ్డున పడిన తమను ఆదుకునేందుకు ప్రత్యేక చొరవ తీసుకుని యాజమాన్యాన్ని ఒప్పించి పెండింగ్ వేతనాలు ఇప్పించాలని కార్మికుల కుటుంబాలు మంత్రి సీతక్కకు విన్నవించారు. ఏటూరునాగారం మండల కేంద్రంలో సీతక్కను శుక్రవారం రాత్రి బిల్ట్ కార్మికులు, కుటుంబ సభ్యులు కలిసి తమ గోడును వెలిబుచ్చి మాట్లాడారు. బిల్ట్ యాజమాన్యం, కార్మిక సంఘాల నాయకులు కుమ్మక్కై ఫిన్‌క్విస్ట్ సంస్థకు లోపాయికారి ఒప్పందాన్ని కుదుర్చుకొని తమను పరిశ్రమలోకి వెళ్లనీయకుండా ఆంక్షలు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు రావాల్సిన వేతనాలు, గ్రాట్యుటీ ఇచ్చేంత వరకు కర్మాగారాన్ని ఎవరూ కొనవద్దన్నారు. ముఖ్యమంత్రిని ఒప్పించి బిల్ట్ యాజమాన్యాన్ని, ఫిన్‌క్విస్ట్ సంస్థ ప్రతినిధులను పిలిపించుకొని మాట్లాడి విధుల్లో అనారోగ్యానికి గురైన సుమారు 75 మంది రెగ్యులర్ కార్మికులు మెరుగైన వైద్యం చేయించుకోలేక మృతి చెందారని తెలిపారు. ఆ కుటుంబాలను అన్ని విధాలా ఆదుకోవాలని, పదేళ్ల నుంచి ఎలాంటి విధులు లేక రోడ్డున పడ్డ వందలాది కుటుంబాలను ఆదుకోవాలని కార్మికులు మంత్రి సీతక్కను కోరారు. కార్యక్రమంలో సుమారు 50 కుటుంబాలు పాల్గొన్నాయి.

కార్యకర్తలను కాపాడుకుంటాం..

▸▸ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు


శనిగకుంటలో అగ్నిప్రమాద బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నేతలు

మంగపేట, మార్చి 9: సైనికుల్లా పనిచేస్తూ పార్టీని బలోపేతం చేస్తున్న కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు(లక్ష్మణ్‌బాబు) అన్నారు. మండలంలోని పలుగ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి శనివారం పర్యటించారు. ముందుగా నర్సింహసాగర్ గ్రామపంచాయతీ పరిధి శనిగకుంటకు చెందిన పెద్దల దేవేందర్ ఇల్లు ఇటీవల అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలిపోగా ఆ కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేలు, బియ్యం అందజేశారు. బీఆర్ఎస్ పార్టీ అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. మల్లూరు మొట్లగూడెంకు చెందిన ఆరెళ్ల దేవేందర్ గుండె ఆపరేషన్ చేసుకోగా పరామర్శించారు. గంపోనిగూడెంలో బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు నూనె లింగయ్య కుటుంబాన్ని కలిసి యోగక్షేమాలను తెలుసుకున్నారు. మంగపేట మాజీ జడ్పీటీసీ సిద్దంశెట్టి వైకుంఠం మాతృమూర్తి జయలక్ష్మి ఇటీవల మృతి చెందగా ఆ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం మంగపేటలో లక్ష్మణ్‌బాబు మాట్లాడుతూ పార్టీ అధికారంలో లేదని నిరుత్సాహం చెందవద్దన్నారు. కార్యక్రమంలో పచ్చ శేషగిరిరావు, కాడబోయిన నరేందర్, మల్లూరు దేవస్థానం చైర్మన్ యూతలకంటి ముకుందం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ, ఎస్కే.కుర్బాన్‌అలీ, తాటి కృష్ణ, చిట్టిమల్ల సమ్మయ్య, గోస్కుల లక్ష్మి, తోలెం నర్సింహారావు, పార్వతి, యూ. శ్రీనివాస్‌యాదవ్, కాకులమర్రి భాస్కర్‌బాబు, టి.రఘు, ఎం.వెంకటేష్, రాణాప్రతాప్‌రెడ్డి, నరేందర్, రతన్‌సింగ్, ఫిరోజ్, జి.శ్రీహరి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి

▸▸ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

▸▸ పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన


కొర్కిశాల మోడల్ స్కూల్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

చిట్యాల, మార్చి 9 : కాంగ్రెస్ ప్రభుత్వంతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో రూ. 70.85 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులతో పాటు అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేవిధంగా కృషి చేస్తానని తెలిపారు. మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.10 లక్షలకు పెంచడంతో పాటు గృహలక్ష్మి, గృహజ్యోతి పథకాన్ని అమలు చేయడం పట్ల సామాన్య ప్రజలు ఆనందంవ్యక్తం చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాల్లో ఇబ్బందులు ఉంటే మండల పరిషత్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు. జడల్‌పేట, జూకల్లు, అందుకుతండా, ఒంటిప్పతండా, వెంచరామి గ్రామాల్లో సీసీ రోడ్లు, మహిళా సమాఖ్య భవనాలు, పాఠశాలల్లో ప్రహరిల నిర్మాణం, అంగన్‌వాడీ కేంద్రం మరమ్మతులతో పాటు చిట్యాలలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో సీసీ రోడ్డు, ప్రహరీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టేకుమట్ల జడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, ఎంపీడీవో రామయ్య, పీఆర్ ఏఈ తిరుపతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి ముకిరాల మధువంశీకృష్ణ, రత్నాకర్‌రెడ్డి, గడ్డం కొమురయ్య, శంకర్‌గౌడ్, నూర వీరన్న, మల్లేష్, రాంరెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

భూపాలపల్లి(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లిలోని క్యాంపు కార్యాలయంలో శనివారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందని తెలిపారు. భూపాలపల్లి ప్రాంత ప్రజలకు ఎంఆర్ఐ, సి.టి స్కాన్ వంటి సౌకర్యాలను కల్పించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. వైద్య సేవలతో పాటు ఉన్నత విద్యను అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మునిసిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు

భూపాలపల్లి(ఆంధ్రజ్యోతి): నేటి ఆధునిక సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలు తలుచుకుంటే సాధించలేనిది ఏదీ లేదన్నారు. అనంతరం మహిళా ప్రజాప్రతినిధులు, అధికారులను శాలువాతో ఘనంగా సత్కరించారు.

మండల అభివృద్ధికి కృషి..

మొగుళ్లపల్లి : మండలం అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని కొర్కిశాల గ్రామంలో గల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, మోడల్ పాఠశాల, ఎల్లారెడ్డిపల్లి, గణేష్‌పల్లి, మొట్లపల్లి, వేములపల్లి, ఇస్సిపేట గ్రామాల్లో శనివారం ఆయన రూ.కోటి నిధులతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణరావు మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసి తీరుతుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుందని, ఉపాధ్యాయులు నాణ్యమైన విద్య అందించాలని సూచించారు. నియోజకవర్గ ప్రజలకు ప్రతినిత్యం అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మండల స్పెషలాఫీసర్ సునీత, తహసీల్దార్ సునీత, ఎంపీడీవో జయశ్రీ, ఎంపీపీ యార సుజాత, కేజీబీవీ స్పెషలాఫీసర్ శైలజ, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ హైమావతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి, జడ్పీటీసీ జోరుక సదయ్య నాయకులు దండ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎర్రబెల్లి పున్నంచందర్, క్యాతరాజు సాంబమూర్తి, గాజర్ల అశోక్, నడిగోటి రాము, క్యాతరాజు రమేష్, ఎమ్డీ.రఫి పాల్గొన్నారు.

కాటారం ఎస్ఐ-2 సురేష్ బదిలీ

కాటారం, మార్చి 9: కాటారం ఎస్సై-2గా పనిచేస్తున్న ఇష్టబోయిన సురేష్ బదిలీ అయ్యారు. శనివారం మల్టీ జోన్-1లో జరిగిన బదిలీల్లో భాగంగా సురేష్ బెల్లంపల్లి టౌన్-1కు ఎస్సై-2గా బదిలీ అయ్యారు. కాగా, వీఆర్‌లో ఉన్న ఎస్సై శ్రీనివాస్‌ను ఇటీవల కాటారం పోలీస్‌స్టేషన్‌కు అటాచ్ చేశారు.

బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ శ్రావణ్



చిట్యాల, మార్చి 9 : స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా జి. శ్రావణ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకాలం ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న జంగిలి రమేష్‌ను ఎస్పీ అటాచ్ చేశారు. సీసీఎస్ భూపాలపల్లిలో విధులు నిర్వహిస్తున్న శ్రావణ్‌ను బదిలీల్లో భాగంగా చిట్యాల ఎస్సైగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో నూతన ఎస్సై శ్రావణ్ బాధ్యతలు స్వీకరించారు.

వైద్యరత్న అవార్డు గ్రహీతకు సన్మానం


రమేష్‌ను శాలువాతో సన్మానిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

కాటారం, మార్చి 9: మండలంలోని ధన్వాడలో బహుజన సాహిత్య అకాడమీ ద్వారా వైద్య రత్న అవార్డు పొందిన సుంకు రమేష్‌ను శనివారం రాత్రి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అల్లాడి శ్రీనివాస్, చంద్రమౌళి, మహేష్, మల్లయ్య, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐకి స్థలం కేటాయింపు

కాటారం, మార్చి 9 : కాటారం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ)కు విలాసాగర్ రెవెన్యూ శివారులోని సర్వేనెంబర్ 392/2లో 8 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. శనివారం అట్టి స్థలాన్ని సర్వే చేసిన రెవెన్యూ అధికారులు హద్దులు ఏర్పాటు చేసి ఐటీఐ ప్రిన్సిపాల్ భిక్షపతికి స్వాధీనపర్చారు. 10ఏళ్ల క్రితమే ఐటీఐకి భూమి కేటాయించి స్వాధీనం చేయకపోవడం, నిధులు ఇవ్వకపోవడంతో భవన నిర్మాణాలు జరగలేదు. ఇటీవల ఐటీఐని అప్‌గ్రేడ్ చేయడానికి ప్రభుత్వం రూ.4కోట్లు కేటాయించిన నేపథ్యంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ భవేష్‌మిశ్రా స్థానిక రెవెన్యూ యంత్రాంగానికి భూమి కేటాయించాలని ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. దీంతో తహసీల్దార్ నాగరాజు గంగారం మోడల్ స్కూల్ సమీపంలో ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి సర్వే చేయాలని ఆర్ఐ వెంకన్న, సర్వేయర్ వినయ్‌లకు సూచించారు. ఈ మేరకు 8 ఎకరాల స్థలాన్ని ఐటీఐ ప్రిన్సిపాల్‌కు స్వాధీనపర్చారు.


హద్దురాళ్లు వేయిస్తున్న రెవెన్యూ అధికారులు

కన్నుల పండువగా శివపార్వతుల కల్యాణం


కల్యాణ మహోత్సవంలో మంగళసూత్రం చూపుతున్న అర్చకుడు

వెంకటాపురం(నూగూరు), మార్చి 9 : మండల కేంద్రంలోని ఉమా రామలింగేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం రాత్రి శివపార్వతుల కల్యాణం వేదపండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ కన్నుల పండువగా జరిగింది. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అంకురార్పణ, ధ్వజారోహణ పూజలు జరిపించారు. ఉత్సవ పందిరి వద్ద ఆలయ కమిటీ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. రాత్రి 10 గంటలకు వేపచెట్టు సెంటర్‌లో ఎదుర్కోలు సన్నాహక కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తుల సమక్షంలో రాత్రి 11 గంటలకు స్వామి వారి కల్యాణాన్ని జరిపించారు. అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేసి మొక్కులు సమర్పించుకున్నారు.

టేకు కలప స్వాధీనం

మహదేవపూర్ రూరల్, మార్చి 9 : మండల పరిధిలోని అంబట్‌పల్లి గోదావరి తీర ప్రాంతంలో అక్రమంగా నిల్వ ఉంచిన టేకు కలపను అటవీశాఖ అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. అటవీశాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని అంబట్‌పల్లి శివారులోని గోదావరి తీర ప్రాంతంలో రెండు ఎడ్లబండ్లలో టేకు కలప నిల్వ ఉన్నట్లు సమాచారం అందడంతో తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. లక్ష రూపాయల విలువ చేసే టేకు కలపను స్వాధీనం చేసుకుని మహదేవపూర్ కలప డిపోకు తరలించినట్లు చెప్పారు. ఈ తనిఖీల్లో సెక్షన్ అధికారులు వరుణ్, మక్బుల్, బీట్ అధికారులు సంజీవ్, రమేష్, బేస్‌క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న టేకు కలపతో అటవీశాఖ అధికారులు

గ్రామాల్లో తాగునీటి సమస్యలు రావొద్దు

▸▸ అదనపు కలెక్టర్ శ్రీజ


జగన్నాథపురంలో పైప్‌లైన్ లీకేజీని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

వాజేడు, మార్చి 9 : మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ అన్నారు. మండలంలోని జగన్నాథపురంలో ఆమె శనివారం పర్యటించారు. మిషన్ భగీరథ తాగునీటి పథకం స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఓవర్‌హెడ్ ట్యాంకులను, పైప్‌లైన్ లీకేజీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జీపీ కార్యదర్శి, మిషన్ భగీరథ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలకు తాగునీటి సరఫరా విషయంలో ఎటువంటి సమస్యలు రాకుండా చూడాలన్నారు. లీకేజీల సమస్యను తక్షణమే పరిష్కరించాలన్నారు. ఓవర్‌హెడ్ ట్యాంకుల శుభ్రత విషయంలో చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండల వ్యాప్తంగా మిషన్ భగీరథ ట్యాంకులు, ఆర్‌డబ్ల్యూఎస్ ట్యాంకుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరిశుభ్రమైన తాగునీరు అందే విధంగా చూడాలన్నారు. లీకేజీల పనులను పూర్తి చేసి నివేదికను పంపించాలని పేర్కొన్నారు. ఆమె వెంట జీపీ కార్యదర్శి హీరునాయక్ తదితరులు ఉన్నారు.

● వెంకటాపురం(నూగూరు) : వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ పి.శ్రీజ అధికారులకు సూచించారు. శనివారం ఆమె మండలంలో పర్యటించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు చేపడుతున్న ప్రాంతాలను పరిశీలించారు. ఈ నెల 7నుంచి 14వ తేదీ వరకు ప్రత్యేక తాగునీటి సరఫరా కార్యక్రమాలు జరుగుతున్న నేపథ్యంలో గ్రామాల్లోని మంచినీటి ట్యాంకులు, పైపులైన్‌ల మరమ్మతులను త్వరితగతిన చేపట్టాలన్నారు. అనంతరం మేజర్ పంచాయతీలోని నర్సరీని ఆమె పరిశీలించారు. మొక్కల పెంపకాన్ని వేగవంతం చేయాలని, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సభను విజయవంతం చేయాలి

గణపురం, మార్చి 9 : భాషాపండితుల ఆత్మీయ సభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శి బైరి నర్సింహ స్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్ ప్రకాశం హాల్‌లో ఆదివారం తెలుగు, హిందీ, ఉర్దూ, మరాఠి భాషాపండితుల ఆత్మీయ సమ్మేళనం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క, పొన్నం ప్రభాకర్ హాజరవుతారని తెలిపారు. జిల్లాలోని భాషా పండితులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడిగా హుస్సేన్‌నాయక్

మహబూబాబాద్ రూరల్, మార్చి 9: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడిగా మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మచ్చర్ల తావుర్యా తండాకు చెందిన బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు జాటోతు హుస్సేన్‌నాయక్ నియామకమయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ అడిషనల్ సెక్రటరీ ఆర్.జయ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మచ్చర్ల తావుర్యాతండాకు చెందిన జాటోతు హుస్సేన్‌నాయక్ బీజేపీ ద్వారా రాజకీయాల్లోకి అరంగేట్రం చేశారు. 2018లో అసెంబ్లీ ఎన్నికల్లో మానుకోట నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా, 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మానుకోట పార్లమెంటరీ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. ఇటీవల 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సైతం మానుకోట నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. ప్రస్తుతం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం ఆయ నను జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడిగా నియమించారు.



హుస్సేన్‌నాయక్ ప్రొఫైల్ :

పేరు	: జాటోతు హుస్సేన్‌నాయక్
పార్టీ	: బీజేపీ
పదవి	: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు
పుట్టిన తేదీ	: 06-03-1982
స్వగ్రామం	: గ్రామం.మచ్చెర్ల మం.గూడూరు, మహబూబాబాద్
తల్లిదండ్రులు	: లచ్చ్యా-గంప్లీ
భార్య	: జమున
పిల్లలు	: పునీత్, డార్విన్
విద్యార్హత	: బీఏ (పొలిటికల్ సైన్స్)

రాజకీయ నేపథ్యం : 2018 నవంబరు బీజేపీలో చేరిక 2018 డిసెంబర్‌లో మానుకోట ఎమ్మెల్యేగా పోటీ 2019 ఏప్రిల్ మానుకోట ఎంపీగా పోటీ చేశారు. 2023 శాసనసభ ఎన్నికల్లో మహబూబాబాద్ నుంచి పోటీ చేసి ఓటమి చెందారు.


చిట్యాల ఎంపీడీవో కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలు

ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

చిట్యాల, మార్చి 9 : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో రామయ్య ఆధ్వర్యంలో ఎంపీపీ దావు వినోద వీరారెడ్డి, ఐకేపీ ఏపీఎం మంజుల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద, ఏఎన్ఎం సుమలత, మహిళా కానిస్టేబుళ్లు కోమల, ఎ.మమత, జి.మమత పంచాయతీ కార్యదర్శులు సునీత, మానస, ఈజీఎస్ టీఏ అపర్ణ, జీపీ సిబ్బంది పుల్ల సారమ్మ, సరిగొమ్ముల సమ్మక్కలను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీవో రామకృష్ణ, హుస్సేన్, పంచాయతీ కార్యదర్శులు రవికుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

కాటారం : మండల కేంద్రంలోని షాలేం ప్రార్థన మందిరంలో కాటారం డివిజన్ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మిత్వా గ్రేసెస్ మినిస్ట్రీస్ సహకారంతో పాస్టర్లు కుటుంబసభ్యులతో కలిసి వేడుకలు జరిపారు. గత మూడు తరాలుగా దేవుని సేవలో తరిస్తున్న మాతంగి సుశీలమ్మతో పాటు పలువురు మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో మిత్వా గ్రేసెస్ మినిస్ట్రీస్ అధ్యక్షుడు ప్రవీణ్, ప్రధానకార్యదర్శి ప్రభాకర్, కోశాధికారి నవీన్, ప్రతినిధులు శ్రీధర్, శిరీషారాణి, నాగమణి, పాస్టర్ల సంఘం నాయకులు మార్క్ డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.


కాటారంలో సుశీలమ్మను సన్మానిస్తున్న పాస్టర్లు, నిర్వాహకులు

చెరువులు మాయం..!

(5వ పేజీ తరువాయి)

పాటు పట్టణంలోని ఓ షాపు యాజమానితో పాటు ఇతర జిల్లాలకు చెందిన వారు కుడా గుడిసెలు వేసినట్లు తెలిసింది. గుడిసెలు ఏకంగా చెరువులో వేయడంతో రాజకీయ కారణాలతో అధికారులెవరూ గుడిసెలు తొలగించక పోవడంతో ఇతర ప్రాంతాల్లో కూడా ఇదే తంతు కొనసాగుతోంది.

ఇరిగేషన్ శాఖ లేఖపై కలెక్టర్ మౌనముద్ర

సమీకృత కలెక్టరేట్ సమీపంలోని గోరంట్లకుంట శిఖం భూమిలో ఆక్రమణలపై నీటి పారుదల శాఖ, సర్వేల్యాండ్, మునిసిపాలిటీ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి అక్రమాలు చోటు చేసుకున్నట్లు తేల్చారు. చెరువు శిఖం హద్దులను కూడా ఏర్పాటు చేశారు. శిఖం భూమిలో వెంచర్, మిరప తోట సాగు, వెంకటేశ్వర ఆలయం నిర్మాణం, కాంప్లెక్స్ కట్టడంతో పాటు ఎమ్మెల్యే కాంప్లెక్స్, ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ నిర్మాణాలు ఉన్నట్లు గుర్తించారు. వీటిలో ఆలయం, కాంప్లెక్స్ నిర్మాణాలు కోర్టు పరిధిలో ఉండటం, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లు ప్రభుత్వ నిర్మాణాలు కావడంతో అధికారులు ఎటూ తేల్చుకోలేని పరిస్థితి. శిఖంలో వెలిసిన ఇతర కట్టడాలపై చర్యలు తీసుకునేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలంటూ నీటిపారుదల శాఖ అధికారులు ఈ యేడాది జనవరి 29వ తేదీన కలెక్టర్ భవేష్ మిశ్రాకు లేఖ రాశారు. ఆక్రమణల తొలగింపుకు చర్యలు తీసుకోవాల్సిన కలెక్టర్ నెల రోజులు గడిచినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఆక్రమణలను తొలగించి చెరువులను కాపాడాల్సిన కలెక్టర్ మౌనంగా ఉండటంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

కోర్టు మెట్లెక్కుతున్న అధికారులు

జిల్లా కేంద్రంలోని చెరువులు అన్యాక్రాంతం అవుతుండటంతో చర్యలు తీసుకునేందుకు ఎటువంటి అధికారాలు లేకపోవడంతో నీటి పారుదల శాఖ అధికారులు హైకోర్టు మెట్లెక్కుతున్నారు. గోరంట్ల కుంట శిఖం భూమిలోని ఆక్రమణలను తొలగించేలా అధికారులకు ఆదేశాలివ్వాలంటూ పిటిషన్ దాఖలు చేయనున్నారు. కాగా, భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని గోరంట్లకుంట శిఖం భూమిలో ఆక్రమణల తొలగింపుపై సంబంధిత శాఖలకు ఆదేశాలివ్వాలంటూ నీటిపారుదల శాఖ అధికారులు రాసిన లేఖపై కలెక్టర్ భవేష్ మిశ్రా తనకు తెలియదంటూ సెలవిచ్చారు.

రామప్పలో బైక్‌ల చోరీ

వెంకటాపూర్(రామప్ప), మార్చి 9: మహాశివరాత్రి సందర్భంగా పాలంపేటలోని రామప్ప రామలింగేశ్వర స్వామిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తుల ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. శుక్రవారం రాత్రి శివపార్వతుల కల్యాణం జరుగగా పెద్దసంఖ్యలో భక్తులు రామప్పకు తరలివచ్చారు. ఈ నేపథ్యంలో భక్తులకు చెందిన రెండు ద్విచక్ర వాహనాలను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లి ధ్వంసం చేశారు. ఈ విషయమై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

గుమ్మడిదొడ్డిలో జ్వరాల నియంత్రణకు చర్యలు

▸▸ డిప్యూటీ డీఎంహెచ్‌వో విపిన్‌కుమార్


రోగికి స్వాబ్ పరీక్ష నిర్వహిస్తున్న వైద్యాధికారులు

వాజేడు, మార్చి 9: మండలంలోని గుమ్మడిదొడ్డిలో అంతుచిక్కని జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో గత నెల రోజులుగా వైద్యాధికారులు ఇంటింటి సర్వేలు, పలు రకాల రక్త పరీక్షలు నిర్వహించినప్పటికి ఎలాంటి ఫలితాలు రాలేదు. దీంతో శనివారం గ్రామంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో విపిన్‌కుమార్ పర్యటించారు. రెండు బృందాలుగా సర్వేలు నిర్వహించారు. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్(డబ్ల్యూహెచ్‌వో) నుంచి వచ్చిన కిట్లతో రోగుల నుంచి రక్త నమూనాలను, స్వాబ్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపించారు. ఇప్పటి వరకు 70 మందిని గుర్తించగా 60 మందికి జ్వరాలు తగ్గుముఖం పట్టాయని, మరో 10 మంది రికవరీ దశలో ఉన్నట్లు తెలిపారు. పీహెచ్‌సీని సందర్శించిన డాక్టర్ విపిన్‌కుమార్ విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రజలు ఎలాంటి భయాందోళనకు గురికావద్దని తెలిపారు. ఇంట్లో జ్వరాలు ఉన్నట్లయితే భౌతిక దూరంతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కలెక్టర్, డీఎంహెచ్‌వో ఆదేశాలతో అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో వైద్యాధికారులు మహేందర్, రాహీల్, అభినయ్, హెచ్‌ఎస్ కోటిరెడ్డి పాల్గొన్నారు.